

నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బెంగళూరుకు చెందిన భక్తులు బుధవారం రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు.



కాలువలోకి జారిన కళాశాల బస్సు

కొల్లూరు : ఓ ప్రైవేట్ కళాశాలకు చెందిన బస్సు అదుపు తప్పి బుధవారం పంట కాలువలోకి జారింది. చివరకు పొక్లెయిన్ సాయంతో బస్సును బయటకు తీశారు.

కలెక్టర్ కార్యాలయం సందర్శన



బాపట్ల : జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు ఎస్. విజయభారతి బుధవారం బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించారు. 'హర్ ఘర్ తిరంగా' ఫొటో ఫ్రేమ్ వద్ద దేశభక్తిని చాటారు.

న్యూస్‌రీల్

నేడు పాఠశాలలకు సెలవు

నరసరావుపేట ఈస్ట్: నిరంతరం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గురువారం పల్నాడు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ బుధవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థుల భద్రత దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పాఠశాలలకు సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం పాఠశాలలకు ప్రకటించాలని కోరారు.

వరద ఉధృతిని పరిశీలించిన కలెక్టర్



దొడ్లేరు(క్రోసూరు): భారీ వర్షాలకు పొంగుతున్న వాగులు, వంకలతో వచ్చిన వరదలను బుధవారం జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు, సత్తెనపల్లి ఆర్డీవో రమణాకాంత్ రెడ్డి పరిశీలించారు. గ్రామంలో హసనాబాద్ రోడ్డు లో లోలెవల్‌చప్టా పై పొంగి ప్రవహిస్తున్న వరదనీరు, పిడుగురాళ్ల రోడ్డులో లోలెవల్ చప్టాపై పొంగుతున్న నీరు, ముస్లిం కాలనీలో వరద పరిస్థితి పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున వరద ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలు ఎవరైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూంకు సమాచారం అందించాలని కోరారు. అనంతరం ఊటుకూరు, బయ్యవరం మీదుగా అమరావతి వెళ్లారు. వారి వెంట తహసీల్దార్ వి.వి.నాగరాజు, ఎస్‌ఐ పి.రవిబాబు ఉన్నారు.

అమరేశ్వర స్వామి పవిత్రోత్సవాలు ప్రారంభం



అమరావతి: స్థానిక అమరేశ్వరాలయంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించే పవిత్రోత్సవాలను అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. తొలిరోజు బుధవారం ఉదయం 5గంటల నుంచి ఆలయ ఆవరణను శుద్ధిచేసి భక్తులకు 9 గంటలకు స్వామివారి దర్శనాన్ని కల్పించారు. రెండవరోజు గురువారం పవిత్రో త్సవాలలో మండప పూజలు, దీక్షాహోమాలు, మూలమంత్ర హవనములు, రుద్రహోమం, పవిత్రారోపణం, చండీహోమం నిర్వహిస్తామని ఆలయ ఈవో రేఖ తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నంబూరు చప్టాలో పడి విద్యార్థి మృతి



పెదకాకాని: ఓ విద్యార్థిని చప్టాలో ప్రవహిస్తున్న నీరు మృత్యు రూపంలో మింగేసింది. ఈ ఘటన నంబూరు గ్రామంలోని విజయభాస్కర్‌నగర్‌లో బుధవారం జరిగింది. పెదకాకాని మండలం నంబూరు విజయభాస్కర్ నగర్‌కు చెందిన నేలపాటి సురేష్‌బాబు, ఎస్తేరురాణి దంపతులకు యోహాన్, షారోన్‌లు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు యోహాన్ 8వ తరగతి, చిన్న కుమారుడు షారోన్ 5వ తరగతి చదువుతున్నాడు. నంబూరు గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టడంతో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. పిల్లలతో పాటు బయట ఆడుకుంటున్న యోహాన్ మరికొందరు కాజ రోడ్డులో ఉన్న చప్టాపైపు వెళ్లారు. మురుగు చెరువు నీటి ఉధృతికి యోహాన్ కాలుజారి చప్టాలో పడి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న స్థానికులు గాలించారు. అప్పటికే నీట మునిగిన యోహాన్ (14) మరణించాడు. ఆడుకునేందుకు బయటకు వెళ్లిన కొడుకు నిమిషాల వ్యవధిలోనే మృతి చెందడంతో తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు స్థానికుల హృదయాలను కలచివేసింది.



క్రోసూరు మండలం దొడ్లేరులో హసానాబాద్ రోడ్డులో పొంగి ప్రవహిస్తున్న వరదనీరు



క్రోసూరు మండలం పెరికపాడు రోడ్డులో చెరువు పొంగి ముస్లింకాలనీలోకి చేరిన వరదనీరు



రాజుపాలెం మండలం గణపవరం చప్టాపైగా ఉధృతంగా ప్రవహిస్తున్న వర్షపునీరు

వర్ష బీభత్సం.. అస్తవ్యస్తం

పల్నాడు జిల్లాను ముంచెత్తిన వాన

- ఉపరితల ఆవర్తనం ప్రభావంతో మంగళవారం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం
- జిల్లాలోని 28 మండలాల్లో భారీ వర్షాలు నమోదు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు
- వర్షాలు ఇలాగే కొనసాగితే ముదురు పత్తి, నారుమళ్లకు తీవ్ర నష్టం
- పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ



పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు గ్రామంలో నీట మునిగిన వరి పొలాలు

సాక్షి, నరసరావుపేట: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో పల్నాడు జిల్లా వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం రాత్రి వరకు ఎడతెరిపిలేని వర్షాలు కురిసాయి. జిల్లావ్యాప్తంగా మంగళవారం నుంచి బుధవారం సాయంత్రం దాకా సుమారు 190 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో గ్రామాలకు బుధవారం ఉదయం రాకపోకలు స్తంభించాయి. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాస్థాయిలో పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో 08647052999 నెంబర్‌తో కంట్రోల్ రూమ్ నెంబర్‌ను ఏర్పాటు చేశామని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. క్రోసురు మండలంలోని దొడ్లేరు గ్రామాన్ని భారీ వదరనీరు చుట్టిముట్టిన నేపథ్యంలో బుధవారం సాయంత్రం పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు, సత్తెనపల్లి ఆర్డీఓ రమణాకాంత్ రెడ్డిలు పర్యటించారు. గ్రామంలో హసనాబాద్ రోడ్డులో లోలెవల్ చప్టాపై పొంగి ప్రవహిస్తున్న వరదనీరు, పిడుగురాళ్ల రోడ్డులో లోలెవల్ చప్టాపై పొంగుతున్న నీరు, ముస్లిం కాలనీలో వరద పరిస్థితి పరిశీలించారు.

కంట్రోల్ రూమ్ నంబరు
0864 7052999

జిల్లాలో 189 సెం.మీ వర్షపాతం

నరసరావుపేట రూరల్: జిల్లాలో బుధవారం రికార్డు స్థాయి వర్షపాతం నమోదు అయింది. గడిచిన 36 గంటల్లో జిల్లాలో 189 సెం.మీ వర్షపాతం నమోదు అయినట్టు జిల్లా అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటల వరకు 169 సెం.మీ, అప్పటినుంచి సాయంత్రం 4గంటల వరకు 20 సెంమీ వర్షం కురిసింది. జిల్లాలో అత్యధికంగా పెదకూరపాడులో 19 సెం.మీ, బెల్లంకొండలో 14సెం.మీ, దాచేపల్లి రూ.14సెం.మీ, అచ్చంపేటలో 13 సెం.మీ, మాచవరం 11 సెం.మీల వర్షం కురిసింది. అలాగే కారంపూడి, రాజుపాలెం, పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో భారీ వర్షం నమోదు అయింది.

నిలిచిన రాకపోకలు

భారీ వర్షాలకు వరద నీరు పోటెత్తడంతో జిల్లాలో పలు ప్రాంతాలకు రాకపోకలకు అంతరాయం కలిగింది. పిడుగురాళ్ల – జూలకల్లు, గుత్తికొండ, దాచేపల్లి – కారంపూడి మధ్య రాకపో కలకు అంతరాయం కలిగింది.

- పెదకూరపాడు మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలు గ్రామాల్లో బ్రిడ్జిలు, చపాట్లు కూలిపోయ్యియి. పాటిబండ్ల–పెదకూరపాడు మధ్య ఉన్న చిన్న బ్రిడ్జి వరద ఉధృత్తికి కూలిపోయింది.
- 75 త్యాళ్లూరు గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు వెళ్లే రహదారిలో చప్టా కోతకు గురైంది. 75 త్యాళ్ళూరు – కాశిపాడు వద్ద ఉన్న లోలెవెల్ చప్టా పూర్తిగా కోతకు గురైంది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.
- యడ్లపాడు మండలం సొలస గ్రామంలో నక్కవాగు పొంగి లోలెవల్ చప్టామీదుగా వరద నీరు ప్రవహించింది. దీంతో సొలస–కొత్తసొలస గ్రామాల మధ్య బీటీరోడ్డు సైతం నీటమునిగింది. చిలకలూరిపేట – ఫిరంగిపురం వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోల రాకపోకలు పూర్తిగా నిలిచి పోయాయి. మధ్యాహ్నం తర్వాత కొద్దిసేపు వర్షం ఆగడంతో నీటి ప్రవాహం తగ్గిపోయింది.
- గురజాల – కారంపూడి రహదారిలో చర్లగుడిపాడు వద్ద లో లెవల్ చప్టా ఉండటం వలన వర్షపు నీరు నిలిచి రోడ్డుపైకి చేరింది.
- మాచర్ల – గుంటూరు రహదారిపై రాజుపాలెం మండలం అనుపాలెం గ్రామం సమీపంలో వాగు రోడ్డుపై గుండా పొంగి ప్రవహించింది. దీంతో మాచర్ల – గుంటూరు మధ్య అన్నివాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఎస్‌ఐ వేణుగోపాల్, సిబ్బంది అనుపాలెం చేరుకొని ప్రమాదం వాటిల్లకుండా వాహనాలను క్రమబద్ధీకరించారు.
- గణపవరం–బలిజేపల్లి గ్రామాల మధ్య ఎద్దు వాగు పొంగి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీని ప్రభావంగా రాకపోకలు నిలిచిపోయాయి.



సత్తెనపల్లి 7వ వార్డులో వర్ష ప్రభావంతో కుప్పకూలిన బైసాని మల్లేశ్వరరావు గృహం



అమరావతి - విజయవాడ మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న మద్దూరు వాగు

దెబ్బతిన్న పత్తి పంట

జిల్లాలో ముందస్తు ఖరీఫ్‌లో భాగంగా వేసిన ముదురు పత్తి పంట భారీ వర్షాలకు దెబ్బతింది. పత్తి విరుపులు స్తంభించిపోతున్నాయి. పగిలిన పత్తి తడిసిపోయింది. అలాగే పక్వానికి వచ్చిన కాయలు బాగా తడవడం వల్ల కుళ్లిపోయే ప్రమాదం ఏర్పడింది. లేత పత్తికి వర్షం వల్ల పెద్దగా ఇబ్బంది లేదు. భారీ వర్షాలకు నారుమళ్లు దెబ్బతింటున్నాయి. వరదనీటితో నారుమళ్లు కోతకు గురవుతున్నాయి. మళ్లీ నారుపోసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. వర్షాలు మరో రెండు రోజులు కొనసాగితే పంటలకు తీవ్ర నష్టం సంభవించే అవకాశాలున్నాయని వ్యవసాయశాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. భారీవర్షాలకు రైల్వేశాఖ అప్రమత్తమైంది. పిడుగురాళ్ల – బెల్లంకొండ మధ్య భారీ వర్షాల కారణంగా బ్రిడ్జి నెంబర్ 59 వద్ద నీరు ప్రమాదకర స్థితిలో ప్రవహిస్తుండటంతో రైల్వేశాఖ అప్రమత్తమైంది. రైళ్ల వేగాన్ని గంటకు 30 కిలోమీటర్లకు తగ్గించారు.

కృష్ణమ్మ ఉగ్రరూపం

కృష్ణానది పరివాహక ప్రాంతాలైన కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణమ్మ పోటెత్తింది. ఎగువనగల శ్రీశైలం జలాశయం నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి 2,30,540 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. నాగార్జునసాగర్ జలాశయం నుంచి 26 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 22గేట్లు 5 అడుగులు, 4 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువకు స్పిల్‌వే మీదుగా 2,34,850 క్యూసెక్కులు, విద్యుదుత్పాదన ద్వారా 28,339 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. దిగువన గల కృష్ణానదిలోకి మొత్తం 2,63,189 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తున్నారు. సత్రశాల వద్ద నున్న నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు రిజర్వాయర్ 16 క్రస్ట్‌గేట్లు ద్వారా 2,75,166 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నారు. టెల్‌పాండ్ ప్రాజెక్టు రిజర్వాయర్ 10 క్రస్ట్‌గేట్లు 3.5 మీటర్లు, 6 క్రస్ట్‌గేట్లు మూడు మీటర్లు ఎత్తు ఎత్తి 2,75,166 క్యూసెక్కుల వరదనీటిని దిగువనున్న పులిచింతల ప్రాజెక్ట్‌కు విడుదల చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టుకు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో 3,50,841 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు నుంచి నదిలోకి 3,64,082 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. కృష్ణానది ఉధృతంగాప్రవహిస్తున్న నేపథ్యంలో పరివాహక ప్రాంతాల్లో జిల్లా అధికార యంత్రాంగం అలెర్ట్ జారీ చేసింది.

చిరస్మరణీయులు 'ఉన్నవ'

గాంధీ ఉపన్యాసాలకు తెలుగు అనువాదకులు ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య

స్వాతంత్ర్య స్ఫూర్తి

యడ్లపాడు: భారత స్వాతంత్ర్య సంగ్రామంలో జాతిపిత మహాత్మాగాంధీ కీలక పాత్ర పోషించారు. అహింస అనే ఆయుధంతో తెల్లదొరల పాలనకు ముగింపు పలికి దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారు. దేశ ప్రజలను చైతన్యవంతులను చేయడానికి, వారిలో స్వాతంత్ర్య స్ఫూర్తిని రగిలించడానికి గాంధీజీ దేశవ్యాప్తంగా పర్యటించారు. హిందీలో ఆయన చేసిన ఉపన్యాసాలు లక్షలాది ప్రజలను కదిలించాయి. అయితే ఆంధ్ర ప్రజల హృదయాల్లో గాంధీ సందేశాన్ని నింపిన ఒక మహనీయుడు ఉన్నారు. ఆయనే ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య. యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామానికి చెందిన రాజగోపాలకృష్ణయ్య హిందీ భాషలో మంచి ప్రావీణ్యం ఉన్న వ్యక్తి. గాంధీజీ ఉపన్యాసాలను తెలుగులోకి తర్జుమా చేసి, ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

హిందీ అనువాదం...

ఆయన ఉపన్యాసాలు హిందీలో ఉన్నప్పటికీ, వాటిని తెలుగులోకి అనువదించి, ఆంధ్ర ప్రజలకు దేశభక్తిని, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని అందించిన గొప్ప వ్యక్తి ఉన్నవ రాజగోపాలకృష్ణయ్య. గాంధీజీ ఆంధ్రదేశానికి వచ్చినప్పుడల్లా ఆయన ఉపన్యాసాలను అద్భుతంగా తెలుగులోకి అనువదించేవారు. గాంధీజీ సైతం ఆయన భాషా నైపుణ్యాన్ని గుర్తించి, తన పక్కనే ఉంచుకుని అనువాదం చేయించుకునేవారు. రాజగోపాలకృష్ణయ్య కేవలం అనువాదకుడిగా మాత్రమే కాకుండా, ఒక గొప్ప దేశభక్తుడిగా కూడా చరిత్రలో నిలిచిపోయారు.



ఎడ్ల బండిపై గాంధీజీ ఊరేగింపు (ఊహా చిత్రం)


ఎడ్లబండ్లపై భారీ ప్రదర్శన...

గాంధీజీ సిద్ధాంతాలకు ఆకర్షితులైన ఆయన, అప్పట్లో ఉన్నవ గ్రామంలో మహాత్ముని విగ్రహాన్ని ఎడ్లబండిపై ఉంచి, కాంగ్రెస్ జెండాలు, గాంధీ టోపీలతో 62 బండ్లతో ఒక భారీ ఊరేగింపు నిర్వహించారు. నాడు ఈ ఊరేగింపు యువతలో ఉత్తేజాన్ని నింపి, గొప్ప దేశభక్తిని రగిలించింది. 1946 ఫిబ్రవరి 5న ఖమ్మంలో జరిగిన బాపు చివరి బహిరంగ సభలో కూడా రాజగోపాలకృష్ణయ్య గాంధీజీ ఉపన్యాసాన్ని తెలుగులోకి అనువదించారు. గాంధీజీ ఆలోచనలను, సందేశాలను తెలుగు ప్రజల గుండెల్లోకి చేర్చడంలో ఆయన చేసిన కృషి అమోఘం, అనిర్వచనీయం. అందుకే ఆయన్ని గాంధీజీ ఉపన్యాసాలకు 'అనువాద బ్రహ్మ' అని పిలుస్తారు. రాజగోపాలకృష్ణయ్య వంటి నిస్వార్థ దేశభక్తులు తమ త్యాగాల వల్ల రాష్ట్ర ప్రజల గుండెల్లో చిరస్మరణీయులుగా నిలిచారు.

గుంటూరు ఆర్డీగా డాక్టర్ శోభారాణి



గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు (ఆర్డీ)గా డాక్టర్ జి.శోభారాణిని నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి. హోస్మణి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఫుల్ అడిషనల్ చార్జి (ఎఫ్ఏసీ) ఆర్డీగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్డీవోగా పనిచేస్తున్న డాక్టర్ కె.సుచిత్రను డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేసి, అక్కడ రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా డాక్టర్ జి.శోభరాణి గుంటూరు వైద్య కళాశాల ఆవరణంలోని రీజనల్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీలో సివిల్ సర్జన్ బ్యాక్టీరియలిస్టుగా పనిచేస్తున్నారు. గతంలో డాక్టర్ శోభరాణి గుంటూరు ఆర్డీగా పనిచేశారు.



పరవళ్లు తొక్కుతున్న శింగరేశ్వర జలపాతం

బెల్లంకొండ: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామంలోని శింగరేశ్వర జలపాతం పరవళ్లు తొక్కుతుంది. శ్రీ కొండ శింగరేశ్వర స్వామి వద్ద గల కొండల మీద నుంచి భారీగా వస్తున్న నీటితో ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తుంది. దాదాపు100 అడుగుల ఎత్తు కొండల మీద నుంచి పాల నురగల్లా జాలు వారుతున్న నీటిధారలతో జలపాతం అబ్బురపరుస్తుంది. బుధవారం వర్షం పడుతున్నప్పటికీ పలు ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు జలపాతంలో తడుస్తూ సందడి చేశారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **2,400** గరిష్టం : రూ. **3,200**

మోడల్ ధర రూ. **2,800**

మిర్చి యార్డు సమాచారం

(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	44,179
అమ్మకాలు	46,990
నిల్వ	7,010

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,400
నంబరు-5	10,000-13,300
341	10,000-14,200
సూపర్ -10	10,000-13,200

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,500
నంబరు-5	10,000-13,400
341	11,000-14,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 14,100
బాడిగ 5531	10,000 - 13,000
దేవనూరు డీలక్స్	10,000 - 13,000
ఆర్మూర్	9,800 - 11,200
తాలుకాయలు	6,000 - 7,300

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

షార్క్-1	10,000-14,200
బాడిగ - 5531	10,000-12,500
ఆర్మూరు	10,200 - 13000
తాలు	5,300 - 7,200

-కొరిటిపాడు (గుంటూరు)



పసుపు ధరలు

(బుధవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **271**

కొమ్ములు : **245** బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,900	10,450	10,400

కాయలు : **26** బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	10,000	10,000

మొత్తం అమ్మకాలు : **203.250** క్వింటాళ్లు



సత్తెనపల్లి వైపు వెళ్లే దారిలో వాగుపై ప్రవహిస్తున్న నీళ్లు



రెంటచింతల మండలం కొత్త పాలువాయి, పాత పాలువాయి గ్రామాల మధ్య ప్రమాదభరితంగా ప్రవహిస్తున్న పిల్లివాగు



రొంపిచర్ల మండలం మాచవరం సమీపంలో ఉధృతంగా ప్రవహిస్తున్న ఓగేరు వాగు



సత్తెనపల్లి నాగన్నకుంట వెనుక బజార్‌లో కోతకు గురైన రోడ్డు

తెరిపివ్వని వాన..పొంగుతున్న వాగులు

సొలస గ్రామంలో లోలెవల్ చప్టాపై నీరు ప్రవహించడంతో రాకపోకలు బంద్

యడ్లపాడు: యడ్లపాడు మండలం పరిధిలో అన్ని గ్రామాల్లోనూ వానలు కురిశాయి. మంగళవారం రాత్రి మొదలైన ఈ వర్షం బుధవారం కూడా చిరుజల్లుల రూపంలో వర్షిస్తూనే ఉంది. దీంతో 26.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు మండలంలోని గ్రామాల్లో ప్రజలకు, పశువులకు, అలాగే ఆస్తినష్టం వంటివి ఏమీ లేవని తహసీల్దార్ జెట్టి విజయశ్రీ తెలిపారు. వర్షం, వాగుల నుంచి వరద పూర్తిగా తగ్గేవరకు సెల్‌నంబర్: 9849904026, 88862 70330 ప్రత్యేక నంబర్లు ఏర్పాటు చేశామన్నారు. అలాగే వీఆర్వోలు, వీఆర్ఏలు గ్రామాల్లోనే ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమైతే తక్షణమే గ్రామస్థాయి అధికారులకు లేదా కంట్రోల్ రూం నంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఎగువ నుంచి వాగుల ద్వారా వచ్చే వరద నీరు అధికమైతే నక్కవాగు పొంగే అవకాశం ఉంటుందని, లోతట్టు గ్రామాలైన జాలాది, దింతెనపాడు, గణేశునివారిపాలెం, తుర్లపాడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటి వరకు కురిసిన వానలకు, ఇలాగే కొనసాగినా పంటలకు ఎలాంటి నష్టం ఉండదని ఏవో ఎ హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం రాత్రి వీచిన గాలులకు పలుచోట్ల విద్యుత్‌తీగలు తెగిపోవడంతో లింగారావుపాలెం, సొలస, ఉన్నవ గ్రామాల్లో సరఫరా నిలిచిందని, సమాచారం అందుకున్న వెంటనే సిబ్బందిని బృందాలుగా అప్రమత్తం చేసి తిరిగి పునరుద్ధరణ చేసినట్లు విద్యుత్ ఏఈ జెస్సీ జయకర్ తెలిపారు.



నిండుగా ప్రవహిస్తున్న నక్కవాగు

అక్కడ రాకపోకలు బంద్...

వానలకు మండలంలోని వాగులు ఎగువ నుంచి వచ్చే వరద నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. సొలస గ్రామంలో నక్కవాగు పొంగి లోలెవల్ చప్టామీదుగా వరద నీరు ప్రవహించింది. దీంతో సొలస- కొత్తసొలస గ్రామాల మధ్య బీటీరోడ్డు సైతం నీటమునిగింది. చిలకలూరిపేట -ఫిరంగిపురం వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఆటోల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మధ్యాహ్నం తర్వాత కొద్దిసేపు వర్షం ఆగడంతో నీటి ప్రవాహం తగ్గిపోయింది.



సొలస గ్రామంలో నక్కవాగు పొంగి చప్టాతో పాటు రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి

- నోడల్ అధికారులు మూడు రోజులు మండలాల్లో ఉండాలి
- జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట రూరల్: రానున్న మూడు రోజులు పాటు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, అన్ని రకాల ముందు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు తెలిపారు. భారీ వర్షాలపై జిల్లా అధికారులు, మండల నోడల్ అధికారులు, ఆర్‌డీవోలు, తహసీల్దార్లుతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మండల నోడల్ అధికారులు మూడు రోజులు పాటు మండలాల్లోనే ఉండి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని తెలిపారు. జిల్లా స్థాయితో పాటు, డివిజనల్, మండల స్థాయిలో కూడా కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, నీటిపారుదల, వైద్యారోగ్య శాఖ, విద్యుత్, వ్యవసాయ, పశు సంవర్థక, ఉద్యాన, గృహనిర్మాణ శాఖలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కాల్వలు, కల్వర్టుల వద్ద కాపలా ఉంచాలని, నీరు పారే సమయంలో వాటిపై ప్రయాణించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిజర్వాయర్ల నుంచి నీరు విడుదల చేసే సమయంలో రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఆసుపత్రుల్లో మందులు, అవసరమైన సామాగ్రి సిద్ధంగా ఉంచాలని, క్షేత్ర స్థాయి సిబ్బంది ఈ మూడు రోజులు గ్రామాలోనే ఉండాలని వైద్యారోగ్యశాఖను ఆదేశించారు. జిల్లా స్థాయిలో పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

లోతట్టు ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

భారీ వర్షాలతో జలమయమయ్యే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ తెలిపారు. తుఫాన్ బారిన పడకుండా తీసుకోవాల్సిన సురక్షిత చర్యలు, ప్రాణనష్టం కలగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిత్యవసర సరుకులు సరిపడా సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్యాస్ సిలిండర్లు, వాహనాలు, జనరేటర్లు, పొక్లయినర్లు సిద్ధం చేసుకోవాలన్నారు. అధికారులు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.

వినుకొండ ఫొటోగ్రాఫర్‌కు గోల్డ్‌మెడల్



వంగపల్లి బ్రహ్మయ్య

వినుకొండ: ఇండియా ఇంటర్నేషనల్ ఫొటో గ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆగస్టు 19న ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా 186వ వరల్డ్ ఫొటోగ్రఫీ డే కాంటెస్ట్ నిర్వహించారు. ఈ కాంటెస్ట్‌లో ఫొటో ట్రావెల్ విభాగంలో వినుకొండ పట్టణానికి చెందిన వంగపల్లి బ్రహ్మయ్య తీసిన ప్రకాశం జిల్లా త్రిపురాంతకం రథోత్సవం ఫొటో అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 18వ తేదీన ఉదయం 11గంటలకు విజయవాడలో బాలోత్సవ భవన్‌లో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఏపీ సృజనాత్మక సంస్కృతి సమితి సీఈవో, డైరెక్టర్ ఆర్ .మల్లికార్జునరావు చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు తెలిపారు.



గోల్డ్‌మెడల్ సాధించిన ఫొటో

త్రిశక్తి దుర్గాపీఠం వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

సత్తెనపల్లి: త్రిశక్తి స్వరూపిణులైన మహాలక్ష్మి, దుర్గా, సరస్వతి అమ్మవార్ల త్రిశక్తి దుర్గా పీఠం 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం మంగళ వాయిద్యాలతో బ్రహ్మోత్సవాలు అంకురార్పణ చేశారు. మహా సరస్వతి సమేత దుర్గామాతకు దశవిధాభిషేకాలు చేశారు. 108 కళశాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవార్లకు పసుపు, కుంకుమ సమర్పణ చేశారు. త్రిశక్తి దుర్గాపీఠం మహిళా శక్తి సభ్యుల ఆధ్వర్యంలో లలిత సహస్రనామ పారాయణం, అమ్మవార్లకు అర్చన, హారతి, మంత్రపుష్పం, ప్రసాద వితరణ, సామూహిక కర్పూర హారతి నిర్వహించారు. అర్చకుడు కలవకొలను సీతారామశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజర య్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా త్రిశక్తి దుర్గా పీఠం పీఠాధిపతులు వెలిదండ్ల హనుమత్ స్వామి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో అమ్మవార్లకు దశవిధ అభిషేకాలు

వాగులో కొట్టుకొచ్చిన గుర్తుతెలియని మృతదేహం



రాజుపాలెం: వాగులో కొట్టుకొచ్చిన వ్యక్తి మృతదేహం ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని ఎస్ఐ వేణుగోపాల్ బుధవారం తెలిపారు. భారీ వర్షాల కారణంగా మండలంలోని కొండమోడు గ్రామం సమీపంలోని కోతులవాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు తెలిపారు. మృతునికి 40 నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండవచ్చన్నారు. మృతదేహంపై బ్లూకలర్ అరచేతుల చొక్కా, బనియన్, షార్ట్ ఉందన్నారు మృతదేహం ఆచూకీ తెలిసినవారు 9440796168, 9440796222 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

భార్యపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి జైలు శిక్ష

రేపల్లె: భార్యను హత్య చేయడానికి ప్రయత్నించిన వ్యక్తికి నాలుగు సంవత్సరాలు జైలు శిక్ష రూ.15 వేల జరిమానా విధిస్తూ రేపల్లె సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల బుధవారం తీర్పు వెల్లడించారు. కేసు వివరాలను పట్టణ సీఐ మల్లికార్జునరావు వెల్లడించారు. రేపల్లె మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన అమర్తలూరి అనిల్ కుమార్ 2023 జూన్ 26వ తేదీ అర్ధరాత్రి సమయంలో భార్య శబరి నిద్రిస్తున్న సమయంలో రాడ్ తోదాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. ఆ సమయంలో బాధితురాలు సోదరుడు చిలకలపూడి వెంకట లక్ష్మణరావు సంఘటనా స్థలానికి రావడంతో నిందితుడు అనిల్ పరారయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న శబరిని సోదరుడు వైద్యశాల తరలించి చికిత్సలు అందించారు. లక్ష్మణరావు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారన్నారు. సాక్షాలను ప్రవేశపెట్టగా సీనియర్ సివిల్ జడ్జి పై విధంగా తీర్పునిచ్చారన్నారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ అనగాని శ్రీనివాసమూర్తి వాదించినట్లు తెలిపారు.

మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

అడిషనల్ ఎస్పీ సంతోష్

నరసరావుపేట రూరల్: మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి అందరూ నడుం బిగిద్దామని జిల్లా అడిషనల్ (అడ్మిన్) ఎస్పీ జేవీ సంతోష్ తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌పై కేసానుపల్లిలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సంతోష్ పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలు, మద్యం వంటి వ్యసనాలు, వ్యక్తిగత ఆరోగ్యానికి మాత్రమే కాకుండా కుటుంబానికి, సమాజానికి, దేశానికి హానికరమని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని ఐదేళ్ల క్రితం ప్రారంభించిందని, యువతను మాదక ద్రవ్యాలు, మద్యం వంటి వ్యసనాల నుంచి దూరంగా ఉంచేందుకు విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారు. కళాశాలలో విద్యార్థుల ప్రవర్తన, నడవడిక, చదువు తదితర అంశాలపై ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం రవాణా వలన ఏర్పడే చట్టపరమైన పరిణామాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులతో మత్తు పదార్థాల వ్యసన నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాశాల ఆవరణలో అడిషనల్ ఎస్పీ మొక్కలు నాటారు. కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఎం.వెంకటరమణ, ఎస్‌బీ-2 సీఐ పి.శరత్‌బాబు, ఈగల్ సెల్ ఎస్ఐ జె.శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్, రూరల్ ఎస్ఐ కిషోర్, ఫాతిమా, కళాశాల చైర్మన్ ఎం.రామశేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాల వ్యసన నిర్మూలన ప్రతిజ్ఞలో అడిషనల్ ఎస్పీ సంతోష్

నూతన మూల్యాంకన విధానం పెనుభారం

ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు

చిలకలూరిపేట: ప్రభుత్వం రూపొందించిన నూతన మూల్యాంకన విధానం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పెనుభారంగా మారిందని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కే కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పోటు శ్రీనివాసరావు విమర్శించారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్ష పేపర్ ద్వారా నిర్వహించటం దానిని మరలా బుక్‌లెట్‌లో నమోదు చేయించడం వలన సమయం వృధా అవుతుందని తెలిపారు. ఎస్‌సీఈఆర్‌టీ ముద్రించిన పుస్తకాలను సకాలంలో పాఠశాలకు చేర్చలేకపోవడం వలన ఆ వివరాలు నమోదు చేసుకోవడానికి ఒక రోజు పూర్తి టైం సరిపోతుందని వాపోయారు. మండల విద్యా వనరుల కేంద్రం నుంచి పాఠశాలకు తెప్పించుకోవడం పాఠశాల నుంచి తరగతి, సబ్జెక్టుల వారీగా వేరు చేసుకుని విద్యార్థుల వివరాలు నమోదు చేయడం తలకు మించిన భారం అవుతుందని వెల్లడించారు. ఇప్పటికే అనేక యాప్‌లతో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులకు పరీక్షల నిర్వహణ ఇబ్బందిగా మారిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ బుక్‌లెట్‌లను ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్టీయూ పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి వి.జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



కూలిన పాటిబండ్ల చిన్న బ్రిడ్జి

- కోతకు గురైన చప్టాలు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పలు చోట్ల కోట్టుకు పోయిన రోడ్లు
- ముందే హెచ్చరించిన 'సాక్షి'

పెదకూరపాడు: పెదకూరపాడులో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు పలు గ్రామాల్లో బ్రిడ్జిలు, చప్టాలు కూలిపోయాయి. పాటిబండ్ల- పెదకూరపాడు మధ్య ఉన్న చిన్న బ్రిడ్జి వరద ఉధృతికి కూలిపోయింది. 75త్యాళ్ళూరు గ్రామంలోని జెడ్పీ పాఠశాలకు వెళ్లే రహదారిలో చప్టా కోతకు గురైంది. 75 త్యాళ్ళూరు - కాశిపాడు వద్ద ఉన్న లోలెవెల్ చప్టా పూర్తిగా కోతకు గురైంది. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పాటిబండ్ల వద్ద బ్రిడ్జిని సత్తెనపల్లి ఆర్డీవో రమకాంత్‌రెడ్డి, పెదకూరపాడు తహసీల్దార్ ధనలక్ష్మీ, ఎంపీడీవో సోమయాజులు పరిశీలించారు. సంబంధిత ఇంజనీరులకు ఫోన్ చేసి యుద్ధప్రతిపాదికన పనులు చేయాలని ఆదేశించారు. పాటిబండ్ల రోడ్డు పలు చోట్ల కోతకు గురైంది. పాటిబండ్ల బ్రిడ్జి కూలేందుకు సిద్ధం అంటూ గత నెల 29న సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది.



కూలిన పాటిబండ్ల చిన్న బ్రిడ్జి



75 త్యాళ్లూరులో కోతకు గురైన చప్టా



సాక్షి

కూలేందుకు సిద్ధం

పెదకూరపాడు: మండలంలోని పాటిబండ్ల - పెదకూరపాడు మధ్య ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జి బీటలు వారుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఇది మరింత ప్రమాదంగా మారి, ఏక్షణమైనా కూలేందుకు సిద్ధమైంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, బ్రిడ్జికి మరమ్మతులు చేయించాలని ప్రజలు

'సాక్షి' ప్రచురించిన కథనం క్లిప్

పొంగిన వాగులు.. స్తంభించిన రాకపోకలు

- గణపవరం-బలిజేపల్లి గ్రామాల మధ్య పొంగిపొర్లిన ఎద్దువాగు
- 8 గ్రామాల మధ్య నిలిచిపోయిన రాకపోకలు
- అనుపాలెం సమీపంలో మాచర్ల - గుంటూరు రహదారిపై పొంగిన మరో వాగు
- మాచర్ల-గుంటూరు మధ్య నిలిచిపోయిన రాకపోకలు
- బలిజేపల్లిలో నిలిచిన విద్యుత్ సరఫరా

రాజుపాలెం: భారీవర్షాల కారణంగా వాగులు పొంగిపొర్లాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గుంటూరు-మాచర్ల రహదారిపై వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. ఎద్దు వాగు పొంగడంతో 8 గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించింది. మాచర్ల-గుంటూరు రహదారిపై అనుపాలెం గ్రామం సమీపంలో వాగు రోడ్డుపై నుంచి పొంగి ప్రవహించింది. దీంతో మాచర్ల-గుంటూరు మధ్య అన్ని వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఎస్ఐ వేణుగోపాల్, సిబ్బంది అనుపాలెం చేరుకొని ప్రమాదం వాటిల్లకుండా వాహనాలను క్రమబద్ధీకరించారు. గణపవరం-బలిజేపల్లి గ్రామాల మధ్య ఎద్దువాగు పొంగి ఉధృతంగా ప్రవహిస్తుంది. దీని ప్రభావంగా రాకపోకలు నిలిచిపోయాయి. ఇనిమెట్ల, ఉప్పలపాడు, బలిజేపల్లి, రామిరెడ్డిపేట, లక్ష్మీపురం చల్లావల్లితండా- గణపవరం, రెడ్డిగూడెం, బీర్లవల్లిపాయ గ్రామాల మధ్య రాకపోకలు స్తంభించాయి. వాగుల సమీప ప్రాంతాల్లో పొలాలు నీటమునిగాయి. మెట్ట పైర్లు సాగుచేస్తున్న రైతులు నష్టపోవాల్సివస్తుందని ఆందోళన చెందుతున్నారు. బలిజేపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడ్డారు. తహసీల్దార్ సరోజిని మాట్లాడుతూ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వీఆర్వోలను ఆదేశించామన్నారు. అంచులవారిపాలెం, అనుపాలెం, గణపవరం ప్రాంతాల్లోని వాగుల వద్ద వీఆర్వోల ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టామన్నారు. వర్షప్రభావానికి సహాయక చర్యల కోసం 24 గంటలు కార్యాలయంలో అందుబాటులో ఉంటామని, అత్యవసర సహాయం కోసం 9949098622 నంబరుకు ఫోన్ చేయవచ్చన్నారు.



గుంటూరు-మాచర్ల రహదారిపై అనుపాలెం గ్రామం వద్ద పొంగిపొర్లుతున్న వాగు



గణపవరం-బలిజేపల్లి గ్రామాల మధ్య పొంగిపొర్లుతున్న ఎద్దువాగు